# ఫలించని నిరీక్షణ

-రాఘవి

షాపింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చింది శిరీష. డ్రైవర్ రామం ఆమెను చూసి కారు డోర్ తెరిచి నుంచున్నాడు. ఆమె కారు ఎక్కింది. వాతావరణం సడెన్‌గా మారసాగింది. నల్లని మేఘాలు దట్టంగా కమ్మసాగాయి ఆకాశాన్ని. గాలి కూడా బలంగా వీస్తోంది. రోడ్‌పై నడుస్తున్నవాళ్ళు తొందరగా వాళ్ళ గమ్యాలు చేరుకోవడానికి నడక వేగం పెంచారు. రోడ్‌కి ఇరువైపులా వున్న పసుపూ్వల చెట్లు అక్షింతల్లా పూలను చల్లుతున్నాయి జనాల పైకి. ఆమె వాటివైపే చూడసాగింది.

''వర్షం వచ్చేలా ఉందమ్మా?'' అన్నాడు రామం బయటకి చూస్తూ.

ఆమె అవునన్నట్లు 'ఊ' అంది. చిన్నగా తుంపర ప్రారంభమయింది. వర్షం కురుస్తుండగా ఆరుబయట ఆడుతూ తడవడం ఆమెకెంతో ఇష్టం. చిన్నప్పుడు అస్తమానం అలా వర్షంలో తడుస్తుంటే జలుబు చేస్తుందని తల్లి మందలించేది. చిన్ననాటి జ్ఞాపకాలు కళ్లముందు మెదిలి పెదవులపై చిరునవ్వు మెరిసింది. వర్షం పెద్దది కావడంతో ఆమె విండో గ్లాస్ వేసేసింది. రిలాక్స్‌గా వెనక్కి జారగిలబడి కళ్ళు మూసుకుందామె. శీతాకాలం కావడంతో తొందరగా చీకట్లు ముసురుకున్నాయి. కాస్త దూరం ప్రయాణం చేసాక కారు చిన్న బ్రేక్‌తో ఆగింది. కారుకి ఏదో అడ్డు వచ్చిందేమో అనుకుందామె.

''అమ్మగారూ! కారుకి చిన్న ట్రబుల్ వచ్చినట్టుంది. నేను దిగి చూస్తాను'' అన్నాడు రామం.

ఆమె కళ్ళు తెరిచి బయటకు చూసింది. వర్షం కురుస్తూనే ఉంది.

''కాస్త వర్షం తగ్గనీ చూద్దువుగానీ'' అంది.

''వర్షం అప్పుడే తగ్గేలా లేదమ్మా. మనం వెళ్లడం లేటయితే పెద్దమ్మగారు కంగారు పడతారు'' అన్నాడు.

ఆమె మౌనం వహించింది.

టార్చ్‌లైట్ పట్టుకెళ్లి బోనెట్ ఎత్తాడు. అందులో ఫాల్ట్ ఏమిటో తెలియలేదతనికి. ఇదేదో మేజర్ ప్రాబ్లమ్ అయి వుంటుంది అనుకుని శిరీష దగ్గరికి వచ్చాడు.

''చిన్నమ్మా! కారుని షెడ్‌కి పంపిస్తేగానీ పని చేయదు. నేను ఎవరి కారన్నా లిఫ్ట్ అడుగుతాను'' అంటూ డోర్ వారగా నుంచున్నాడు.

''వర్షం బాగా కురుస్తోంది. లోపలకు వచ్చేయ్'' పిలిచిందతన్ని.

''ఫర్వాలేదమ్మా'' అంటూ అక్కడే నిలబడ్డాడు.

ఆమె నిట్టూర్చి తను కొన్న టెడ్డీబేర్‌ని ఒడిలోకి తీసుకుంది. ఆ బొమ్మని తను ఇంటి ప్రక్క పోర్షన్‌లో వుంటున్న పాప కోసం కొన్నది. ఆ పాపంటే శిరీషకు చాలా ఇష్టం. రేపు ఆ పాప బర్త్‌డే కావడంతో గిఫ్ట్‌గా ఇవ్వడానికి దాన్ని కొంది. తృప్తిగా ఫీలయింది ఆ బొమ్మను చూస్తూ. రేపు ఆ పాప కళ్లల్లో మెరిసే మెరుపులను ఊహించుకుంటోంది శిరీష.

రోడ్డుపై వాహనాలు ఒకటీ అరా వెళ్తున్నాయి. ఎక్కువగా లారీలు వెడుతున్నాయి. రెండు టాక్సీలను లిఫ్ట్ అడిగాడుగానీ ఆపలేదు వాళ్ళు. అప్పటికే చాలా ఆలస్యం కావడంతో వచ్చే కారుని ఎలాగైనా ఆపాలనుకున్నాడు రామం దృఢంగా.

దూరం నుండి కారు వస్తున్నట్లు గమనించడంతో రోడ్డుకు మధ్యగా నుంచున్నాడతను. కారు అతనికి దగ్గరగా వచ్చి సడెన్‌బ్రేక్‌తో ఆగింది. వెంటనే డ్రైవింగ్ సీట్లో ఉన్నతని దగ్గరకువెళ్లి లిఫ్ట్ కావాలని అడిగాడు రామం.

అతడో క్షణం ఆలోచించి డోర్ తెరిచాడు ఎక్కమన్నట్లు.

''ఒక్క నిముషం'' అని తమ కారు దగ్గరికి పరుగెత్తాడు. శిరీషని పిలిచి ఆ కారు ఎక్కమన్నట్లు చూపించాడు. శిరీష తటపటాయిస్తుండడంతో ''ఫర్వాలేదమ్మా. నేనున్నానుగా'' అన్నాడు. శిరీష దిగి కారు దగ్గరకు వెళ్లింది.

డోర్ తెరిచి తలెత్తి ఆమెను చూసినతడు అప్రతిభుడై ఉండిపోయాడు. ఆమె కూడా అతన్ని చూసి షాక్‌కు గురైంది.

''అమ్మా! నేను వచ్చేయ్యనా?'' తమ కారువైపు చూస్తూ సంశయంగా అడిగాడు రామం.

''నీ ఇష్టం'' అంది నిర్లిప్తంగా.

''అయితే కారు షెడ్‌కి పంపించి వస్తాను'' అని వెళ్లిపోయాడతను. అతను డ్రైవ్ చేస్తున్నాడేగానీ హృదయం నిండా ఉద్విగ్నత చోటు చేసుకుంది. తన ప్రక్కన కూర్చున్నది శిరీషేనా? అతనికంతా కలలా ఉంది.

తియ్యని అనుభూతులు, స్మృతుల పరిమళాలు అతన్ని చుట్టుముడుతున్నాయి. ఆమెతో గడిపిన మధుర క్షణాలన్నీ సినిమా రీళ్ళల్లా అతని మెదడులో కదులుతుండగా-

''శిరీషా బాగున్నావా?'' పలకరించాడు ఇక ఆగలేక.

''బాగున్నాను'' మెల్లని స్వరంతో బదులిచ్చిందామె.

తన ప్రశ్నకు జవాబిచ్చి ఊరుకుందేమిటి? నా గురించి అడగదా? నేను ఇన్నాళ్ళూ ఆమెకోసం చకోరపక్షిలా ఎదురుచూస్తున్నానని ఆమెకు తెలియదా? ఏమిటి ఆమెలో అంత మార్పు? అతనికి అనుమానంగానూ, భయంగానూ తోచింది ఆమె ప్రవర్తన.

మన జీవితంలో తెలుసున్న వ్యక్తి ఎక్కడైనా తారసపడితే పలకరించి ఊరుకున్నట్లు ఊరుకుందామె.

''నువ్వెప్పుడు వచ్చావు స్టేట్స్‌నుంచి?'' అడిగాడు ఆత్రుతని అణచుకోలేక.

''ఈమధ్యే వచ్చాం?''

ఆమె సంభాషణని పొడిగించకపోవడంతో అతను మౌనం వహించి ఆలోచనల్లోకి వెళ్లాడు. శిరీష మనసు కూడా గతంలోకి ప్రయాణించసాగింది.

• • •

''శిరీషా! మీ అన్నయ్య నాకు వార్నింగ్ ఇచ్చాడు. నేను నీకు దూరమవ్వకపోతే చంపుతాడుట!'' అన్నాడు ప్రణయ్.

ఆ మాటలకు ఉగ్రురాలైందామె.

''అంటాడు. ఎన్నయినా అంటాడు. అయినా మధ్యలో వాళ్లకెందుకో బాధ! ప్రేమించుకున్నవాళ్ళ మానాన వాళ్ళని వదలరుగా! కులం, మతం, అంతస్తు అంటూ ప్రేమికులని వేరు చేయాలని చూస్తారు. ఆస్తి ఎవరికి కావాలి. డర్టీ స్టేటస్! వాడు మాత్రం నా దారికి అడ్డువస్తే నేను ఒప్పుకోను.

అంతగా అయితే నీతో వచ్చేస్తాను ఎక్కడికైనా'' ఆవేశంగా అంది శిరీష.

''శిరీషా! కూల్‌డౌన్. ఆ విధంగానే పెళ్లి చేసుకోవాలనుకుంటే ఇంతవరకూ ఆగడం ఎందుకు? పెద్దవాళ్ళని ఒప్పించి పెళ్లి చేసుకోవాలని కదా మన అభిమతం. మీ అన్నయ్యను ఎదిరించాలనుకోకుండా అతన్ని కన్విన్స్ చేయడానికి ప్రయత్నించు. నువ్వంటే మీ అన్నయ్యకు ప్రాణమని అంటూ ఉంటావుగా'' సర్దిచెప్పాడామెకు. ఆమె శాంతించింది.

''ఒకే ఐ విల్ ట్రై'' చిరునవ్వుతో అతని దగ్గర వీడ్కోలు తీసుకుని వెళ్లిపోయింది.

ఆ రోజు అన్నాచెల్లెళ్లిద్దరికీ పెద్ద గొడవే జరిగింది.

''అమ్మా! పెళ్లి చేసుకునేది నేను. మధ్యలో వీడి ఇష్టమేమిటి?'' అన్నయ్య శంకర్‌వైపు కోపంగా చూస్తూ అంది తల్లితో శిరీష.

''అవునా! ఆ అబ్బాయి మంచివాడు. నీ చెల్లెలు అంతగా ఇష్టపడుతున్నప్పుడు ఆ అబ్బాయికిచ్చి పెళ్లి చేస్తే బాగుంటుంది'' అంది తల్లి.

''అమ్మా! శిరీష వాడ్ని పెళ్లి చేసుకుంటే నరకం అనుభవిస్తుందమ్మా. ప్రేమ అన్నది సుఖాన్ని, సౌకర్యాలను ఇవ్వాలమ్మా. పెళ్లయిన కొన్నాళ్ళకే జీవితం మీద విరక్తి కలుగుతుంది ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోతే'' చెల్లెల్ని కన్విన్స్ చేయడానికి ప్రయత్నించాడు శంకర్.

''మన ఆర్థిక పరిస్థితులు బాగున్నాయిగా! అయినా ప్రణయ్‌తో ఏ పరిస్థితిలో జీవించడానికైనా నేను సిద్ధం. మీరుగాని నాకు పెళ్లి చేయదలచుకుంటే ప్రణయ్‌తో చేయండి. లేకపోతే నన్ను జీవితాంతం ఒంటరిగా వదిలేయండి'' స్థిరంగా అని తన గదిలోకి వెళ్లిపోయింది.

పదినిముషాలు గడిచాక చెల్లెలు దగ్గరకు వెళ్లాడు శంకర్.

''శిరీషా! నేను ఆలోచించేది నీ కోసమే. నువ్వు జీవితంలో సుఖ సంతోషాలతో జీవించాలన్నదే నా కోరిక. అంతే! అంతగా నువ్వు ప్రణయ్‌నే కోరుకుంటే అతన్నిచ్చే నీకు పెళ్లి చేస్తాను'' అన్నాడు.


శిరీష అపనమ్మకంగా చూసిందతన్ని.

''కానీ మీ పెళ్లి నీ చదువు పూర్తి చేసాకే! అన్నయ్య నిన్ను ఎప్పటినుండో స్టేట్స్‌కు రమ్మంటున్నాడు. నువ్వు అక్కడ చదువు పూర్తి చేసిన వెంటనే ప్రణయ్‌తో నీ పెళ్లి'' అని చిరునవ్వుతో వెళ్లిపోయాడు శంకర్.

శిరీష సంతోషానికి అవధులు లేకుండా పోయింది.

ఆఘమేఘాల మీద వెళ్లి ప్రణయ్‌కు ఆ విషయం చెప్పింది. అతను ఆనందం పట్టలేక ఆమెను పట్టుకుని గాల్లో తిప్పాడు.

''ప్రణయ్ కళ్ళు తిరుగుతున్నాయి ఆపు'' అంది నవ్వుతూ.



మరుక్షణం అతని ముఖంలో విచారం గూడుకట్టుకుంది.

''ఏమైంది ప్రణయ్! డల్ అయ్యావ్?'' అడిగింది కంగారుగా శిరీష.

''రోజులో ఒక్కసారైనా నిన్ను చూడకుండా ఉండలేను. అటువంటిది నువ్వు అమెరికా వెళ్లిపోతే నేను ఉండగలనా?'' అన్నాడు బాధగా.

''మన ఈ ఎడబాటు మనం శాశ్వతంగా కలిసి ఉండడానికే ప్రణయ్. అమెరికా వెళ్లడం మానేద్దామనిపిస్తోంది. కానీ అక్కడ చదవడం నా లైఫ్ యాంబిషన్'' అంది విచారంగా.

ఇద్దరూ చాలాసేపు తమ భవిష్యత్ గురించి చర్చించుకుని విడిపోయారు.

అమెరికా వచ్చాక కొన్నాళ్ళు ప్రణయ్ నుండి లెటర్స్ వస్తూ ఉండేవి. అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకునే వాళ్ళు ఇద్దరూ. అలాంటిది ప్రణయ్ నుండి లెటర్స్ రావడం మానేసాయి. ఫోన్‌లో కూడా అతను దొరకలేదు. అతని గురించి సమాచారం తెలియక ఆందోళన పడసాగిందామె.

హఠాత్తుగా ప్రణయ్ నుండి శుభలేఖ వచ్చింది. అది చూడగానే



## శత్రువు

''మీకెవరైనా శత్రువులున్నారా?'' అడిగింది భార్య.

''వీర వెంకట సత్యనారాయణ అని ఒకాయన ఉన్నారు?'' చెప్పాడు భర్త.

''అయ్యో! ఆయనేం చేసారండీ!''

''మన పెళ్ళి కుదిర్చింది అతనే కదా!''

## సినిమా

''ఏమండీ! సాయంత్రం ఆఫీసునుండి తొందరగా రండి!'' అంది భార్య.

''అలాగే! సినిమాకేనా?'' అడిగాడు భర్త.

''అవును సినిమాకే! ఎదురింటావిడా, నేనూ కలసి వెళ్తున్నాం. మీరు ఇంటికి కాపలా ఉండాలి'' అంది భార్య.

## సలహా

''డాక్టర్‌గారూ! నాకీ మధ్య ఏ వస్తువును చూసినా రెండుగా కనిపిస్తున్నాయండీ!'' చెప్పాడు అప్పారావు.

''మీరేం వర్రీ కాకండి. ఏదైనా చూసేటప్పుడు ఒక కన్ను మూసుకుని చూడండి. సరిపోతుంది'' చెప్పాడు డాక్టర్.

## కలలో...

''డాక్టర్‌గారూ! మీరు నాకు నిన్న రాత్రి కలలో ఆపరేషన్ చేసారు?'' చెప్పాడు అప్పారావు.

''అలాగా! అయితే ఫీజు మాటేమిటి?'' అన్నాడు డాక్టర్.


''ఈరోజు రాత్రి కలలో పంపిస్తాలే!''

## రేపు

''నా బాకీ రేపు ఇస్తానన్నావుకదా! మరి ఇవ్వవేమిటి?'' అడిగాడు సుబ్బారావు.

''ఇప్పుడు కూడా అదే మాట చెబుతున్నాను. నీ బాకీ రేపు ఇస్తాను'' చెప్పాడు అప్పారావు.

-శ్రీనివాస్ వల్లాల (నారాయణఖేడ్)




ఆమెకి కళ్ళు తిరిగినట్టయి కూలబడిపోయింది. నెమ్మదిగా తేరుకుని వణికే చేతులతో దీక్షగా చూసింది శుభలేఖని ప్రణయ్‌ది కాదన్న నమ్మకంతో. ఆమె ఆశ అడియాస అయ్యింది. దాంతోపాటు మెసేజ్ పంపాడు ప్రణయ్. 'మా బంధువుల అమ్మాయిని పెళ్ళి చేసుకోకపోతే తండ్రి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడనీ, అందుకే మనసు చంపుకుని ఆమెను పెళ్ళి చేసుకుంటున్నానని, నన్ను క్షమించమని' రాసాడు. ఆమె మనసు మొద్దుబారిపోయింది. ఒకసారి ప్రణయ్ తనతో అన్నాడు ''మా మామయ్యగారి అమ్మాయిని చేసుకోమని నన్ను తినేస్తున్నారు'' అన్నాడు సరదాగా చెబుతూ.

ఆదే నిజమయిందా ఇప్పుడు అనుకుంటూ పెళ్ళి డేట్ చూసింది. 'మైగాడ్! నిన్నే జరిగిపోయి వుంటుంది. బెడ్‌పై వాలిపోయింది ఏడుస్తూ.

అన్నయ్య, వదినెలు వచ్చి సముదాయించారు శిరీషని.

''వాడు నిన్నింత మోసం చేస్తాడనుకోలేదు. వాడికన్నా గొప్పవాడ్ని తీసుకువచ్చి నీకు పెళ్ళి చేయకపోతే అడుగు'' సవాల్ చేసాడు పెద్దన్నయ్య రమేష్.

ఇండియా నుండి శంకర్ వచ్చాడు. అన్నదమ్ములిద్దరూ చాలాసేపు చర్చించుకున్నారు.

''నిన్ను మోసం చేసినందుకు ప్రణయ్‌ని షూట్ చేసేద్దాం అనుకున్నాను. నమ్మకద్రోహి'' అన్నాడు కసిగా శంకర్.

శిరీష చదువు పూర్తి అవడంతో ఆమెకు పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. శిరీష పెళ్ళి చేసుకోనని పట్టుబట్టింది.

''ఎందుకు వద్దంటున్నావు? ప్రణయ్ పెళ్ళి చేసుకుని హాయిగా జీవిస్తుంటే నువ్వు వాడ్ని తలచుకుంటూ బాధపడుతూ ఉంటావా? అదెంత షేమ్?'' రెచ్చగొట్టాడు చెల్లెల్ని శంకర్.

శిరీషకు ఉక్రోషమొచ్చింది.

''నేను పెళ్ళి చేసుకుంటాను'' అంది స్థిరంగా.

శంకర్ ఫ్రెండ్ అయిన రోహిత్‌తో పెళ్ళి జరిగిపోయింది శిరీషకు. రోహిత్‌కు ఇండియా మీదే మక్కువ. అందుకే ఇండియాలోనే సెటిల్ అవ్వాలని వచ్చేసారు పదిరోజులముందు.

ఆమె జీవితంలో ప్రణయ్‌ని చూడకూడదనుకుంది. కానీ అతను మళ్ళీ తన జీవితంలో ఇలా తారసపడతాడని ఆమె ఊహించలేదు.

రోడ్డువైపు దృష్టి సారించింది. ఆమె ఇంటి అడ్రస్ అడిగాడు ఆమెనక్కడ డ్రాప్ చేయడానికి. మనిషి బాగా సంపాదిస్తున్నట్టున్నాడు అనుకుంది అసంకల్పితంగా.

ఆమె ఇంటిముందు ఆపాడు కారుని. కారు దిగి లోపలకు వెళ్ళబోతూ ఆగి ''లోపలకు రా'' ఆహ్వానించింది మర్యాదన్నట్లు. ఆమె ప్రవర్తన అతనికి బాధ కలిగించినా అసలు సంగతేంటో తేల్చుకుందామని అనుసరించాడామెను.

''వచ్చావా బేబీ! నీకోసమే చూస్తున్నాను. పాప నీకోసం వచ్చి ఆడుకుని నిద్రపోయింది. నేను వాళ్ళమ్మగారికి ఇచ్చేసి వస్తాను'' అని బయటకు వెళ్ళబోతూ ప్రణయ్‌ని చూసి అవాక్కయింది శిరీష తల్లి. అతను పలకరింపుగా నవ్వాడు. ఆమె పాపను తీసుకుని వడివడిగా బయటకు వెళ్ళింది. ఇంతలో కరెంట్ పోయింది. శిరీష క్యాండిల్ పట్టుకుని అగ్గిపెట్టె కోసం వెతుకుతుండగా లైటర్ వెలిగించి క్యాండిల్‌ను వెలిగించాడు ప్రణయ్. ఆమెతో తమ పెళ్ళి విషయం ప్రస్తావిద్దామనుకునేలోగా లోపలికి ఒక వ్యక్తి వచ్చాడు. అతను రావడం, కరెంట్ రావడం ఒకేసారి జరిగాయి. శిరీష దగ్గరకువెళ్ళి ''నాతోపాటు వెలుగును కూడా తీసుకువచ్చాను డియర్'' అన్నాడు నవ్వుతూ.

అతను కోటు విప్పుతూ చూసాడు ప్రణయ్‌ని. వెంటనే సందేహంతో శిరీషను చూసాడు.

''ప్రణయ్...నా క్లాస్‌మేట్'' పరిచయం చేసి అతను ఇక్కడకు రావడానికి కారణం చెప్పింది.

''హలో! వెరీ గ్లాడ్ టు మీట్ యూ. ఐయామ్ రోహిత్'' అని ఆగి ''మీ ఫ్రెండ్‌కు భర్తను'' అని నవ్వాడు.

అతను చివరగా అన్న మాటలు విని కొయ్యబారిపోయాడు ప్రణయ్. శిరీషకు అతను భర్త అని అంటున్నాడేమిటి? వీళ్ళిద్దరికీ పెళ్ళి జరిగిపోయిందా? ఎప్పుడు? ఎలా? అతనికి ఆలోచనలతో మెదడు వేడెక్కి బ్లాంక్ అయిపోయాడు.

ఇద్దరికీ కాఫీ తెచ్చింది శిరీష. కాఫీ అందుకునే స్థితిలో లేడు ప్రణయ్. ఆమె కాఫీ కప్పుతో అలాగే నుంచుంది.

''హలో ప్రణయ్‌జీ! కాఫీ లీజియే'' అన్నాడు రోహిత్ నవ్వుతూ.

ప్రణయ్ ఉలిక్కిపడి కాఫీ అందుకున్నాడు.

''ఏమిటండీ ఎక్కడ ఉన్నారు మీరు?'' అడిగాడు రోహిత్.

బలవంతంగా పెదవులపై చిరునవ్వు లాక్కున్నాడు ప్రణయ్.

''కాలేజీ డేస్‌కి వెళ్ళిపోయినట్టున్నారు. మీరూ శిరీషలా మొహమాటస్థుల్లా కనిపిస్తున్నారు'' అన్నాడతను భార్యవైపు చూస్తూ. ఆమె నవ్వడానికి ప్రయత్నించింది.

''మీరు చాలా స్మార్ట్‌గా ఉన్నారు. పెళ్ళయిందా లేదా?'' అడిగాడు రోహిత్.

సమాధానం చెప్పడానికి అతను ఒంట్లోని శక్తిని కూడదీసుకుంటున్నాడు. అతను అంత సరదాగా

మాట్లాడుతున్నప్పుడు తను సీరియస్‌గా ఉన్నట్లుంటే బాగుండదు. మనసును మెల్లగా ఆధీనంలోకి తీసుకు వచ్చి సమాధానం చెప్పబోతుండగా–

''అయ్యింది. వాళ్ళ మామయ్యగారి అమ్మాయితో'' ఠక్కున వచ్చింది సమాధానం శిరీష నుంచి.

అతడు చెప్పడానికి సిగ్గుపడుతున్నాడనుకుందామె. దిగ్భ్రాంతితో శిరీషను చూసాడు ప్రణయ్. తనకు పెళ్ళవడమా? అదీ శిరీష దృష్టిలో! అంతా పజిల్‌గా తోచిందతనికి. ఇక ఒక్కక్షణం అక్కడ ఉండబుద్ధి కాక లేచాడు ప్రణయ్.

''అరే అప్పుడే లేచారే! మా ఇంటికి వచ్చిన మొదటి గెస్ట్ మీరు. లంచ్ అయ్యాకే మిమ్మల్ని పంపుతాం'' అవునా అన్నట్లు భార్యవైపు చూసాడు రోహిత్.

''భోజనం చేసి వెళ్ళు ప్రణయ్'' అంది శిరీష.

''మీ పెళ్లి ఎప్పుడు జరిగింది?'' అడిగాడు రోహిత్‌ను ప్రణయ్.

''రెండు నెలలు దాటింది. అమెరికాలోనే జరిగిపోవడంవల్ల ఇక్కడెవరికీ ఇంకా తెలియదు'' చెప్పాడు రోహిత్. ''ఇంకా శిరీష తన ఫ్రెండ్స్ ఎవరినీ కలుసుకోలేదు. మేము ఇండియా వచ్చి ఎన్నో రోజులు అవలేదుగా'' అన్నాడు రోహిత్.

శిరీషకు పెళ్లయిపోయిందన్న విషయాన్నే జీర్ణించుకోలేకుండా ఉంటే తిరిగి తనకు పెళ్లయిపోయిందని శిరీష అనడం ప్రణయ్‌ని విపరీతమైన షాక్‌కు గురి చేసింది. అతని హృదయంలో అగ్నిపర్వతాలు పేలుతున్నాయి. అక్కడ నిలబడలేకపోయాడు ప్రణయ్.

''నాకు చాలా అర్జెంట్ పనుంది. నేను వెంటనే విజయవాడ వెళ్లిపోవాలి'' అన్నాడు ఎవరో తరుముతున్నట్లు.

''ఓకే మిమ్మల్ని బలవంతం చేయం. ఈసారి వచ్చినప్పుడు మీ భార్యను తప్పకుండా తీసుకురావాలి. ఏమయినా నా భార్యను ఈ రాత్రి వేళలో ఆపద్బాంధవుడిలా కాపాడారు'' కృతజ్ఞతలు చెప్పాడు రోహిత్.

''వెళ్తా శిరీషా!'' అంటూ వడివడిగా అడుగులు వేస్తూ బయటకు వచ్చేసాడు.

డ్రైవ్ చేస్తున్నాడుగానీ అతనికి దారంతా మసక మసకగా కనిపిస్తోంది. వర్షం వెలిసినా గుండెలో నుండి దుఃఖం తన్నుకువస్తోంది. లోపల ఇంతసేపూ అతను ఎలా ప్రవర్తించాడో అతనికే తెలియదు. తెలిసింది ఒక్కటే తన ఆశల సౌధాలు కూలిపోయాయని!

అసలు ఇదంతా ఎలా జరిగింది? ఏమిటి తన జీవితం ఇలా తారుమారయింది. శిరీషను ఆ రోజున కలవనంతవరకూ ఆమెతోనే ఊహించుకున్న తన జీవితం, ఆశలు, కోరికలు అన్నీ ఇప్పుడు చిన్నాభిన్నమయ్యాయి. ఎవరు దీనికి కారకులు? అతను ఆలోచిస్తుండగా శిరీష అన్నయ్య కళ్లముందు మెదిలాడు.

అవును శంకరే ఇదంతా చేసి ఉంటాడు. అతడే తమిద్దరినీ విడదీసాడు. తన గురించి ఏవేవో చెప్పి ఆమె మనసు మార్చి ఉంటాడు. అవును. శిరీష తనకు పెళ్లయింది అని కదూ అంది. ఆ సాకుతోనే ఆమె మనసు విరిచేసి ఉంటాడు. ఎంతో నమ్మకద్రోహి వాడు. తను ఏం పాపం చేసాడు? తను పేదవాడు కావచ్చు. అది క్షమించరాని నేరమా!

అందుకే కదా శిరీష అమెరికా వెళ్లిన మరుక్షణం సొంతంగా బిజినెస్ ప్రారంభించి రాత్రి పగలు కష్టపడి ఇంత పైకి వచ్చాడు. ఆ బిజినెస్ పనిమీదే ఇప్పుడు హైదరాబాద్ రావడం జరిగింది కూడా. శిరీషకు ఏ లోటూ రాకుండా చూడడం కోసమేకదా తను అహర్నిశలూ శ్రమించాడు.

ఇద్దరి పెళ్లికి ఒప్పుకున్నట్లే నటించి ఇలా విడదీసాడు. శిరీష నుండి ఏ సమాచారం తెలియకపోవడంతో శంకర్‌ని కలిస్తే శిరీషకు అస్సలు ఖాళీ ఉండడంలేదనీ, అందుకే లెటర్స్ వ్రాయడం లేట్ అయి ఉండవచ్చన్నాడు. తన చదువు ఎలాగూ పూర్తి కావస్తోంది కాబట్టి ఇక తనని డిస్టర్బ్ చేయవద్దని, ఆమె చదువులో ఏకాగ్రత దెబ్బతింటుందని చెప్పడంతో ఊరుకున్నాడు తను. ఎన్ని కుయుక్తులు పన్నాడు శంకర్! అతన్ని తలచుకుంటుంటే ప్రణయ్ ఒంట్లో రక్తం మరగసాగింది. వాడు అనుకున్నది సాధించాడు.

చివరకు తను ఒంటరివాడయ్యాడు. తనకు పెళ్లి అవలేదని శిరీషతో చెబితే! శిరీష తట్టుకోగలదా? శిరీష కోసమే తను ఇంట్లోవాళ్ళకి నచ్చచెప్పి మామయ్య కూతురికి కట్నం కూడా ఇచ్చి పెళ్లి జరిపించాడు.


శిరీషకు నిజం తెలిస్తే ఏం చేస్తుంది? తన అన్నయ్యను అసహ్యించుకుంటుంది. భర్తమీద నిర్లిప్తత ఏర్పడవచ్చు. అంతేగానీ గడిచిన రోజుల్ని మళ్ళీ తీసుకురాలేదుగా! భార్యాభర్తలిద్దరూ చిలకాగోరింకల్లా ఉన్నారు. శిరీష సంతోషంగా ఉంటే చాలు తనకు.

బాధనంతటినీ తనే జీవితాంతం అనుభవిస్తాడు. ఆమె దృష్టిలో తను మోసగాడిగా ముద్రింపబడినా ఫర్వాలేదు. ఆమె సుఖసంతోషాలతో జీవిస్తే చాలు, తన హృదయంలో మాత్రం ఆమెకు ఎప్పుడూ స్థానం ఉండే వుంటుంది.

విధి ఎందరినో ఎన్నో రకాలుగా వంచిస్తూ వుంటుంది. అది తనని శంకర్ రూపంలో వంచించింది. ప్రేమకథలు రకరకాలు. అందులో తనది ఒకరకమైనది. ముగింపు ట్రాజెడీ అయింది. విరక్తితో కూడిన నవ్వు అతని పెదవులపై మెదిలింది.

★

## డెడ్‌బాడీలు క్షేమమే!



'పాజిరిక్' అనే ప్రదేశంలో క్రీ.పూ.500 నాటి సమాధి లోపల ఒక పురుష శరీరం, ఒక స్త్రీ శరీరం కనిపించాయి. పచ్చబొట్లు పొడిచివున్న ఆ శరీరాలు 2500 సంవత్సరాలు గడిచినా ఎంతమాత్రం చెక్కుచెదరకపోవడం విచిత్రం. ఆ వ్యక్తులు మరణించిన కొద్దిసేపటికే ఆ శరీరాల్ని శీతలీకరణం చేయడం వల్ల ఇది సాధ్యమయిందని అంటున్నారు. ఆ ప్రాంతాల్లో కనిపించిన పధ్నాలుగు సమాధుల్లో ఒకటైన ఈ సమాధిలో ఆ కాలంనాటి కొన్ని వస్తువులు కూడా క్షేమంగా ఉన్నాయట!

## కన్నీళ్ళ కథ వెనుక

నీళ్ళకుండ నెత్తినున్నట్టుగా కొందరు ఇట్టే ఏడ్చేస్తుంటారు. పిలిస్తే వస్తాయి కన్నీళ్ళు. ఆడవారికి మరీను. మరికొందరికి ఎలాంటి విషాద ఘటనలు ఎదురయినా కళ్ళ నుండి ఒక్కచుక్క కూడా నీళ్ళు రావు. నిజానికి వారు ఎలాంటి భావోద్వేగానికి లోనుకారని అర్థంకాదు. అన్ని భావాలూ వాళ్ళకీ వుంటాయి. జోగ్రెన్స్‌సిండ్రోమ్ అనే డిసీజ్‌తో బాధపడటమే ఇందుకు కారణం. ఈ జబ్బు వలన వారి కళ్ళనుంచి ఎలాంటి నీళ్ళూ రాకపోవడంతో వారి కళ్ళూ, నోరూ ఎండిపోయినట్టుంటాయి. అదీ సంగతన్నమాట!

## తబలా

తబలా వాయించే మహిళల్లో తొలి వాద్యకారిణి డాక్టర్ అబాన్‌మిస్త్రీ. 2,200 సంవత్సరాల క్రితమే తబలా వాద్యం మనదేశంలో వుందట. తొలి వాద్యకారుడు మాత్రం 17వ శతాబ్దికి చెందిన అమీర్‌ఖుస్రో ట. తబలానా మజాకా! మరి!

- రాధ

